1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

గురువారం | నవంబర్ 21, 2024 | www.navatelangana.com

సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన

నవతెలంగాణ-జన్నారం



రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై, మండలంలోని చింతగూడ కిష్టాపూర్ దేవుని గూడా గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం సంస్కృతిక కళాకారులు ప్రదర్శన చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్కృతిక కళాకారుల టీం లీడర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ ప్రదర్శనలు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని చెప్పారు. సంస్కృతిక కళాకారులు గొడిసెల కృష్ణ, కిష్టయ్య, సంతోష్, లచ్చన్న, నాగలక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.

కవ్వాల్‌ను సందర్శించిన నెదర్లాండ్ దేశస్తులు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కవ్వాల్ అడవిలో బుధవారం నెదర్లాండ్ దేశస్తులు పర్యటించారు. మంగళవారం రాత్రిలో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో బసా చేసినట్లు హరితరిసార్ట్ మేనేజర్ వీరేందర్ తెలిపారు. బుధవారం మల్యాల, అలినగర్, గిరిజన గ్రామాలను సందర్శించారు. అడవి జంతువుల, వృక్ష సంపదపై అటవీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువారం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నార్నూర్ గిరిజన గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న తిని.. ముచ్చటించి..

- సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కడెం

మండలంలోని ఉడుంపూర్ వద్ద మొక్కజొన్న కంకులు విక్రయిస్తున్న మహిళ వ్యాపారితో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముచ్చటించి సరదాగా గడిపారు. మహిళ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఆ వ్యాపారి సైతం కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమాలు బాగున్నాయని సమాధానం ఇచ్చింది. కుటుంబ పోషణ మొత్తం మొక్క జొన్నల వ్యాపారంపైనే ఉందని, కొడుకుకు అంగవైకల్యం ఉందని, నెలకు రూ.4వేల పెన్షన్ వస్తుందని ఆమె ఎమ్మెల్యేకు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి మొక్కజొన్నలు కొనుగోలు చేసి జీవనాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తన సమస్యలు ఎమ్మెల్యే తెలుసుకోవడం పట్ల ఆ మహిళ వ్యాపారి సంతోషం వ్యక్తం చేశారు.

ఆంగ్లం పట్ల మక్కువ పెంచుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆంగ్లం పట్ల విద్యార్థి దశ నుండే మక్కువ పెంచుకోవాలని ఆర్డీఓ లోకేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుడు మహమ్మద్ అష్రఫ్ సౌజన్యంతో స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలవాలంటే ఆంగ్లం తప్పనిసరైందన్నారు. విద్యార్థి దశ నుండి ఆంగ్లం భాషపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఖాజా నిజాముద్దీన్, మాజీ పాఠశాల చైర్మన్ అబ్దుల్ హన్నాన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లలిత, ఉపాధ్యాయ తన్వీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వాలీబాల్‌లో రాణించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో రాణించిన కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రౌతు వర్షితను బుధవారం ఘనంగా సన్మానించారు. 8వ తరగతి చదువుతున్న రౌతు వర్షిత మెదక్ జిల్లా చేగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో బాలికల విభాగంలో రాణించి తృతీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా వర్షితతో పాటు తండ్రి పురుషోత్తంను తోటి విద్యార్థుల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్శ చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాబూరావు, గణపతి, రాందాసు, ఉపాధ్యాయులు రవి, అనిత, లాలాజీ, ఫిజికల్ డైరెక్టర్ పరమశివ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత ప్రదర్శన

నవతెలంగాణ-బెజ్జూరు

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలపై బుధవారం జిల్లా సాంస్కృతిక సారథి బృందం ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారెంటీ పథకాలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కళాకారులు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భీమ్లా నాయక్, కార్యదర్శి తుకారాం, కాంగ్రెస్ నాయకులు హకీమ్, కళాకారులు బాపు, సోమశేఖర్, పురుషోత్తం, శిరీష ఉన్నారు.

డాంబర్ టిపర్ బోల్తా

- క్యాబిన్ ఇరుక్కున్న డ్రైవర్

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని గాంధీనగర్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై డాంబర్ లోడుతో ఇచ్చోడ వస్తున్న టిపర్ బోల్తా పడింది. స్థానికులు, ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలో బీటీ రోడ్డు పనుల కోసం గుడిహత్నూర్ మండలంలోని సోమ కంపెనీ నుంచి డంబర్ లోడు చేసుకొని ఇచ్చోడకు వస్తున్న క్రమంలో గాంధీనగర్ వద్ద అదుపు తప్పి టిప్పర్ బోల్తా పడింది. దీంతో టిప్పర్ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కున్నారు. రెండు కండ్లకు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై తెలిపారు.

అంగరంగ వైభవంగా స్వామివారి రథోత్సవ ఊరేగింపు

నవతెలంగాణ-జైనథ్

ఆదిలాబాద్ జిల్లాలోని అతి పురాతనమైన దేవాలయాలలో ఒకటి శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయం. ఆదిలాబాద్ నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రతి సంవత్సరంలాగే బుధవారం సాయంత్రం రథోత్సవ శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్, కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. రథోత్సవం అనంతరం 20 తేదీ నుంచి 25వ తేది వరకు జాతర ఉంటుందని ఈఓ వామన్‌రావు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి

నవతెలంగాణ-ఉట్నూర్

సబ్బండవర్గాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ప్రజా పాలన కళాయాత్ర ప్రజారథాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. సబ్బండవర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి దాదాపు సంవత్సరం కావస్తున్న సందర్భంలో ప్రజాపాలన విజయోత్సవాలను రాష్ట్రమంతా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ తిరుమల, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బానోత్ జైవంతరావ్, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుంది

- సివిల్ సప్లై కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్



నవతెలంగాణ-హాజీపూర్

ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుందని రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. లక్షెట్టిపేట్ మండలంలోని గుల్లకోటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం హాజీపూర్ గుడిపేట్‌లోని కేంద్రంను పరిశీలిస్తూ కొనుగోలు కేంద్రంకు ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చింది అని నిర్వాహకులను అడిగి తెలుసున్నారు. సన్న రకం ఎంత, దొడ్డు రకం ధాన్యం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ధాన్యానికి సంబంధించిన తేమ ఏ విధంగా ఉందని పరిశీలించారు. అలాగే ధాన్యాన్ని తీసుకొని దాని మాయిచర్ ఏ విధంగా ఉంది అని పరీక్షించారు. కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటుతో పాటు నాణ్యత గల ధాన్యం ఉండటంతో సంతోషం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వాహకులకు జనవరి 26 అవార్డు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సన్న రకం ధాన్యం ఎక్కువగా విక్రహించేలా రైతులను ప్రోత్సహించాలని నిర్వాహకులకు తెలిపారు. కొందరు రైతులు సన్నరకం ధాన్యాన్ని దళారులకు అమ్ముతున్నారని వాటిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రహించేలా అవగాహనా కల్పించాలని మండల వ్యవసాయ అధికారి క్రిష్ణను ఆదేశించారు. రైతులతో మాట్లాడుతూ సన్నరకం ధాన్యాన్ని దళారులకు అమ్ముకూడదని కోరారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2320తో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ పొందాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సన్న రకం ధాన్యం ఎక్కువగా వస్తునందుకు ఆశభావం వక్తం చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలలో అమ్మిన్న రెండు రోజుల్లోపు డబ్బులతోపాటు రూ.500 బోనస్ రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌డీఓ కిషన్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మరావు, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావుదేశ్పాండే, మండల వ్యవసాయ అధికారి క్రిష్ణ, ఐకేపీ ఏపీఎం రాజన్న పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ ఆందోళన



నవతెలంగాణ-మందమర్రి

కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి గని మేనేజర్‌కి వినతిపత్రం అందచేశారు. బుధవారం కెకె-5 గని వద్ద ఏఐటీయూసీ గని ఫిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్మిక సమస్యలపై ఆందోళన నిర్వహించి గని మేనేజర్ ప్రదీప్‌కి మెమోరాండం అందజేశారు. గనిలో నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని తీవ్రమైన చలికి వణుకుతున్న ట్రామర్ ఉద్యోగులకు వాంకోట్స్ ఇవ్వాలని సర్ఫేస్ బంకర్ పై రేకులు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని మార్చాలని నాణ్యమైన గ్లౌజులు షఉస్ తదితర పనిముట్లు ఇవ్వాలని, షెడ్డు ఉద్యోగులందరికీ లాకర్ సదుపాయం కల్పించాలన్నారు. ఎంవీటీసీ నుంచి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం జరగలేదని పూర్తిస్థాయిలో సిమెంటు రోడ్డు నిర్మించాలని అన్నారు. గుర్తింపు సంఘంగా ఆందోళన చేయడం ఏమిటని కొందరు అనుకోవచ్చు కానీ మేము ఒకటికి రెండుసార్లు యాజమాన్యానికి చెప్పి సమస్యలు పరిష్కారం కాకుంటే ఆందోళన చెయ్యక తప్పదని తెలిపారు. ఈ నెల 28వ తేదీన కార్పొరేట్ స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు, సొంతింటి పథకం అమలుకు కృషి చేస్తామని తెలిపారు. కొన్ని సంఘాలు పనిగట్టుకుని మా గుర్తింపుని జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మాపై పెట్టె శ్రద్ధని కార్మికుల సమస్యలపై ప్రభుత్వంపై యాజమాన్యంపై పెడితే బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి ప్రేమ్ లాల్, సేఫ్టీ కమిటీ నాయకులు మేకల సంతోష్, సొట్ట కొండయ్య, గోవిందుల రమేష్, గుమ్మడి సంపత్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పనులను వేగవంతం చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-తాండూర్

సమగ్ర సర్వే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని 20 వవార్డులో సర్వే పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సర్వేలో సేకరించిన సమాచారంతో అభివృద్ధి పథకాల అమలు పరచడం జరుగుతుందన్నారు. కుటుంబ సర్వేతో రాష్ట్రంలో విద్యాభివృద్ధి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు అవగతమవుతాయని తెలిపారు. సర్వేకు వివరాల అందించడం ద్వారా వ్యక్తిగత ఆస్తులకు సంపాదనకు ఎటువంటి ఆటంకం కలగదన్నారు. ప్రజలంతా సమగ్ర బహుళ ప్రయోజన కుటుంబ సర్వేకు సహకరించాలని కోరారు. సర్వే పూర్తిచేసిన అధికారులు వెంటనే కార్యనిర్వాహక పనుల్లో నిమగ్నం కావాలని సూచించారు. బెల్లంపల్లి పట్టణంలో 79 శాతం సర్వే పనులు పూర్తి చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కలెక్టర్ తెలిపారు. మొత్తం 130 బ్లాకులకు గాను 24 బ్లాకుల్లో పూర్తిస్థాయి కుటుంబ సర్వే జరిగినట్లు వివరించారు. కుటుంబ సర్వేను సమయానికంటే ముందే పూర్తి చేసిన ఎన్యూమరేటర్లను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్‌తో ఆర్డీఓ హరికృష్ణ 20వ వార్డు కౌన్సిలర్ గోషిక రమేష్ సర్వే సిబ్బంది ఉన్నారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ రకాల భూ సమస్యలపై ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వర్ రావులతో కలిసి ధరణి ధ్రువపత్రాలు, కళ్యాణలక్ష్మిపై తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో విరాసత్, భూ విస్తీర్ణం సవరణ, పేరు సవరణ, నిషేధిత జాబితాలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కార్యాలయ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులు ఉన్న వాటిపై రికార్డులను పూర్తిగా పరిశీలించి నివేదిక అందించాలని సూచించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలకు మీ సేవ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. కల్యాణ లక్ష్మి షాది ముబారక్‌కు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారి జాబితాను రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటేసిన సరిహద్దు గ్రామాల ప్రజలు

నవతెలంగాణ-కెరమెరి

గతేడాది తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేసిన సరిహద్దు గ్రామాల ప్రజలు. ఇప్పుడు బుధవారం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ సరిహద్దు గ్రామాల ప్రజలు ఓటేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు వివాదంలో ఉన్న 12 గ్రామాల్లోని ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్ వేయడానికి తరలివచ్చారు. మండలంలోని 12 గ్రామాలు మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా రాజురా నియోజకవర్గం జీవతి తాలూకా పరిధిలో కూడా ఉన్నాయి. పరందోళి, అంతాపూర్, మహరాజ్‌గూడ, శంకర్‌లొద్ది, ముక్దంగూడ, లెండిగూడ, గౌరి, పద్మావతి, ఇసాపూర్, ఇందిరానగర్, బోలాపటార్ గ్రామాల ప్రజలకు తెలంగాణతో పాటు మహారాష్ట్రలోనూ ఓటు హక్కు ఉంది. ఈ 12 గ్రామాల్లోని ఓటర్ల కోసం మహారాష్ట్ర ఎన్నికల సంఘం పరందోళి, అంతాపూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, రాజురా నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో అంతాపూర్, పరందోళి కేంద్రాల పరిధిలోని ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సాయంత్ర వరకు బారులు తీరారు.



విద్యారంగంలో చుక్క రామయ్య సేవలు విలువైనవి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్య రంగా అభివృద్ధి కోసం రాష్ట్రంలో చుక్క రామయ్య చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాయిని శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలో జీజేఎల్ఏ ఆధ్వర్యంలో చుక్కరామయ్య జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య రంగా అభివృద్ధి కోసం చుక్కారామయ్య చేస్తున్న సేవలు విలువైనవన్నారు. దేశానికి ఎంతోమంది విద్యావేత్తలను అందించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్, ఉపాధ్యక్షుడు లక్కాకుల సంతోష్, అధ్యాపకులు అమరేందర్, చంద్రయ్య, కుతుబుద్దీన్, బైరాగి, వేణుకుమార్, రామకృష్ణ, హరిదాస్ పాల్గొన్నారు.

సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు తెలిపారు. లింగాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన ఏఎస్ఐ నారాయణ కుటుంబ సభ్యులకు భద్రత చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసే విధంగా చూస్తామన్నారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు వారి కుటుంబాలకి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ అజయ్ వర్మ, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, సీసీ కిరణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్-4కు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రూప్-4 ద్వారా రెవెన్యూ శాఖలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను జిల్లా కేంద్రంలో అధికారులు పరిశీలించారు. పరిశీలన విధానాన్ని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన 39 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్, సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే మానసిక ఒత్తిడిని జయించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

విద్యార్థులు సమయపాలన అలవర్చుకోవడం ఎప్పటి పనులు అప్పుడు పూర్తి చేసుకోవడం ద్వారా ఆయా అంశాలలో వెనుక పడకుండా మేము చేయగలమనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటే మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చుని సెక్టోరల్ అధికారి జె.నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమం అమలు పర్యవేక్షణలో భాగంగా బుధవారం మావల ఉన్నత పాఠశాల, దేవాపూర్ ఉన్నత పాఠశాల సందర్శించడం జరిగిందన్నారు. షెడ్యూల్లో భాగంగా మానసిక ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మరో సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి సంపదతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-తాంసి

పశుపోషకులు పాడి సంపదను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశుసంవర్థక శాఖ ఏడీ రామారావు పోషకులకు సూచించారు. బుధవారం భీంపూర్ మండలంలోని అంతర్‌గాం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పశుపోషకులు వ్యవసాయ అనుబంధంలో భాగంగా పాడి పశు సంపద పెంచుకోవాలని ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు నిర్వహించారు. గోడలకు నట్టల నివారణ మందులు వేయించాలని పశువులకు ముందస్తుగా రోగ నివారణ టీకాలు తప్పకుండా పశువైద్యశాలలో వేయించాలన్నారు. టీకాలు ఉచితంగానే వేయడం జరుగుతుందన్నారు. పశుపోషకులు పశు సంపద పెంచుకోవడానికి శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సుబాష్ రాథోడ్, సిబ్బంది నవీన్, గజానన్, గోపాలమిత్ర మల్లికార్జున్, ప్రవీణ్, అజయ్, సంతోష్ ఉన్నారు.

వందశాతం సర్వేను పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక కుటుంబ సర్వేను వందశాతం పూర్తి చేయాలని డీఎల్పీఓ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మిలింద్‌నగర్‌లో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను పరిశీలించారు. ప్రతి రోజు ఎన్ని కుటుబాలకు సర్వేలు చేపడుతున్నారని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా కుటుంబీకులను వివరాలను అడిగి రాయాలన్నారు. రెండు రోజుల్లో వందశాతం సర్వేను పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు నిర్వహించిన సర్వేకు సంభందిత రిపోర్టును సూపర్‌వైజర్‌లకు అందచేయాలని సూచించారు.

కళాశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వాడుక నియంత్రణ గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో లైంగిక వేదింపులకు వ్యతిరేకంగా విద్యార్థుచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, వైస్ ప్రిన్సిపల్ గణపతి రఘు, ఎన్ఎస్ఎస్ పీఓ పృథ్వి, అనిత, గజానన్ సిబ్బంది పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-తలమడుగు



డిసెంబర్ 1న చలో హైదరాబాద్ జింకనా మైదానంలో జరగబోయే మాల అనుబంధ కులాల సింహగర్జన గోడ ప్రతులను బుధవారం సుంకిడి గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ అనుబంధ కులాల జరగబోయే మాలల సింహగర్జన అధిక సంఖ్యలో మాలలు దాని అనుబంధ కులాలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి ముల్కల రాజేశ్వర్, అశోక్, ప్రహ్లాద్, అసోసియేషన్ అధ్యక్షులు మలపతి సుభాష్, పాశం రాఘవేంద్ర, ముచ్చ, రఘు, పోశెట్టి, సుంకిడి గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-కుభీర్



ఇటీవల కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న డోడర్నా తండా-1కు చెందిన చవాన్ సతీష్ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో బుధవారం ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు మండల నాయకులతో కలిసి రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తానని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రజల కష్ట సుఖలను తెలుసుకొని వారికి సేవలు చేసేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్ కాంగ్రెస్ నాయకులు తూము రాజేశ్వర్, మాజీ సర్పంచులు మహిపాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు చిన్నన్న, కళ్యాణ్, సాయినాథ్, జాదవ్ శంకర్, గణపతి, బిక్కు, వసంత్, మోహన్, గ్రామస్తులు ఉన్నారు.

13వ మహాసభను విజయవంతం చేద్దాం



నవతెలంగాణ-జైనథ్

జిల్లాలో జరగనున్న 13వ సీపీఐ(ఎం) మహాసభను విజయవంతం చేయాలని నాయకులు సూచించారు. ఇందులో భాగంగా మండలంలోని బోరజ్, రాంపూర్, సిర్సన్న, గ్రామాలలో జీపు జాతను కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈనెల 28న జిల్లాలో నూతనంగా నిర్మించిన సీఐటీయూ భవన ప్రారంభోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశన్న, వెంకన్న, శంకర్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేని పరిశీలన

నవతెలంగాణ-బేల

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సామాజిక సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలదేవి స్థానిక తహసీల్దార్ రఘునాథ్‌రావ్‌తో కలిసి పలు వార్డులలో పరిశీలించారు. ఎన్యూమరేటర్ చేపడుతున్న సర్వేని దగ్గరుండి తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ వార్డులో డ్రైనేజీ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె స్పందించి తప్పకుండ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి నేరుగా సబ్ మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు తీరును పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతుల సోయా కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సామాజిక సమగ్ర సర్వేకు ప్రజలు విశేషంగా స్పందించడం పట్ల ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. మండలంలో నేటి వరకు 78.11 శాతం సర్వే పూర్తయిందని అన్నారు. మిగితా కుటుంబాల సర్వేని గడువులోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

అమలు కాని మహిళల చట్టాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళల కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు, పథకాలు తీసుకువచ్చిన వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి ఆరోపించారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందులో మహిళలపై జరుగతున్న దాడులు, హైదరాబాద్‌లో ఈనెల 23, 24 తేదిల్లో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించే రాష్ట్ర మహాసభలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి మాట్లాడుతూ మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఆయా పనుల్లో తమ ప్రతిభను చూపుతు ముందుకు సాగుతున్నారన్నారు. 30 ఏండ్లుగా భారత జాతీయ మహిళ సమాఖ్యకు ఆదిలాబాద్ మహిళలు ఆదరిస్తున్నారని తెలిపారు. సభ్యత్వాలు తీసుకుంటు మహిళ పోరాటంలో ముందున్నారని తెలిపారు. ఈనెల 23, 24 తేదిల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర మహాసభల్లో ఆదిలాబాద్ నుంచి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి అమీన ఖాన్, ఎస్.కృష్ణవేణి, పి.సంగీత, ఆత్రం సంగీత, శాభాన ఖాన్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

నవతెలంగాణ-జైనథ్

మానసిక ఒత్తిడిని ప్రతి ఒక్కరూ జయించాలని సఖీ జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. ఇటీవల జిల్లాలో ప్రత్యేకంగా ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశపెట్టిన ఆరోగ్యపాఠశాల అనే కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో మానసిక ఒత్తిడి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యేశించి ఆమె మాట్లాడారు. మానసిక ఒత్తిడికి కారణాలు, ఒత్తిడి వల్ల దుష్పరిణామాలు, ఒత్తిడి నుంచి బయటపడే విధానాలు, నివారణ మార్గాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థులు మానసికంగా ధృఢంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, కేజీబీవీ పాఠశాల ఎస్ఓ వీణా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్నూర్ : విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావద్దని ప్రశాంతతతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి ఉదయ్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఆరోగ్య కళాశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల మానసిక ఒత్తిడి నివారణపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి బాలాజీ కాంబ్లె, సిబ్బంది వెంకటరమణ, నరేష్, సుజాత, పుష్ప, జాలిందర్ ఉన్నారు.

విద్యార్థులకు గ్రామస్తుల చేయూత

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని అర్లి(టి) ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు గ్రామస్తులు చేయూతని అందించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు నవీన్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల కోసం సంసిద్ధంలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు కొనసాగడం జరుగుతున్నాయి. విద్యార్థులకు అభివృద్ధి కమిటీ తరపున పదివేల రూపాయల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మికి అందించారు. గతంలో కూడా పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారం అందించడం జరిగిందన్నారు. పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థులు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రముఖులు అశోక్, లక్ష్మయ్య, రహూఫ్, నితిన్ ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టు భద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల, పాఠశాల ఉపధ్యాయులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-జైనథ్

సీఐటీయూ జిల్లా కార్యాలయం బాశెట్టి మాధవరావు విజ్ఞన కేంద్రం ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని పిప్పర్‌వాడ టోల్ ప్లాజా యూనియన్ ఆధ్వర్యంలో కార్యాలయ ప్రారంభోత్సవ బహిరంగ సభ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నవంబర్ 28న సీఐటీయూ జిల్లా కార్యాలయం బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందాకరత్, మాజీ పార్లమెంటు సభ్యులు మీడియం బాబురావు, మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత హాజరవుతున్నారని అన్నారు. కార్మిక పోరాటాల సారథి, ఐక్య ఉద్యమాలవారధి కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా కార్యాలయం ప్రారంభమనేది జిల్లా కార్మిక వర్గానికి పండుగలాంటిదని అన్నారు. ప్రారంభోత్సవ సభకు కార్మికులు ప్రజలు కర్షకులు ఆదివాసీలు కార్మిక ఉద్యమ శ్రేయోభిలాషులు వేలాది సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గంగన్న, టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షులు ఏ.సంతోష్, నాయకులు రమేష్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కారు అద్దాలు పగలగొట్టి.. డబ్బులు చోరీ..

- రూ.లక్ష 80 వేలు ఎత్తుకెళ్లిన దొంగలు

నవతెలంగాణ-భైంసా



పట్టణంలోని బస్టాండ్ పక్కన ఉన్న ఎస్బీఐ బ్యాంక్ ప్రాంగణంలో ఆగి ఉన్న కారులో నుంచి కారాద్దాలు పగలగొట్టి దాదాపు రూ.లక్ష ఏనభై వేలు చోరీ చేసిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... లోకేశ్వరం మండలం గడ్‌చందా గ్రామానికి చెందిన అల్లం భోజన్న బీడీ కంపెనీ నిర్వహిస్తుంటానని, అయితే బీడీ వర్కర్లకు పేమెంట్ నిమిత్తం పట్టణంలోని నిర్మల్ రహదారిలో గల ఎస్బీఐ బ్యాంక్ నుంచి రూ.90 వేలు విత్ డ్రా చేశానని, అలాగే మిగతా దాదాపు రూ.90 వేలు బ్యాగ్‌లో ఉన్నాయని ఈ రెండు అమౌంట్ కలిపి దాదాపు రూ.లక్ష 80వేలు కారులో ఉండగా గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు పగలగొట్టి బ్యాగులో ఉన్న డబ్బులు ఇతర వగైరా వస్తువులను దొంగిలించారని తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితున్ని గుర్తించే పనిలో పడ్డారు. బాధితుడు ఇక్కడి ప్రాంగణంలో ఆగడానికి గల కారణాలను పోలీసులు అడగగా బస్టాండ్ పక్కన గల బ్యాంకులో పెద్ద నోట్లను, చిన్న నోట్లగా మార్చుకోవడానికి వచ్చానని సమాధానం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాలు పరిశీలించే పనిలో పడ్డారు.

బాధితులకు షెల్టర్ ఇవ్వడంలో సిబ్బంది నిర్లక్ష్యం

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బాలసదనంలో బాధితులకు షెల్టర్ ఇవ్వడంలో ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. బాధితులను బాలసదనంలో చేర్పించుకోవడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం బాలసదనాన్ని పరిశీలించారు. ముందుగానే ఫిర్యాదుపై సిబ్బందితో సమావేశం నిర్వహించాలని డీడబ్ల్యూఓ సబితను ఆదేశించిన ఉదయం 10.45 నిమిషాలైన ఎవరు రాలేదు. సిబ్బంది ఎవరు లేకపోవడంతో డీఎల్ఎస్ఏ కార్యదర్శి బాలసదనంలో పర్యటించి, వివరాలు తెలుసుకున్నారు. అక్కడి చేరుకున్న డీడబ్ల్యూఓతో మాట్లాడి వివరాలు అడిగారు. సిబ్బంది మధ్య గొడవల కారణంగా బాధితులను చేర్పించుకోవడం లేదని తెలిసింది. వెంటనే సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ ఫోక్సో, లైంగికదాడి, ఇతర బాధిత చిన్నారులకు రక్షణకల్పించేందుకే బాలసదనం ఉందన్నారు. కానీ కొన్ని రోజుల క్రితం ఓ బాధితురాలిని సిబ్బంది లేదని, చెప్పి పక్క జిల్లా నిర్మల్ బాలసదనంకు పంపించారన్నారు. ఇదే విషయమై ఇక్కడ తనిఖీ రావడంతో రెగ్యూలర్ కుక్, అంటెండర్ ఉన్నట్టు గుర్తించామన్నారు. సంక్షేమ శాఖ అధికారి కూడా వీరిని నియంత్రించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిసిందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు డీఎల్ఎస్ఏ ద్వారా లేఖరాస్తామన్నారు. అప్పటికి చర్యలు లేకపోతే లీగల్ యాక్షన్ తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

టెక్నాలజీ వచ్చినా పుస్తకాల విలువ తగ్గలేదు




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మారుతున్న కాలంలో కొత్త టెక్నాలజీ వచ్చిన పుస్తకాలకు ఉన్న విలువ తగ్గలేదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపును బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హజరయ్యారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పాటలు పడగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రంథాలయ అధికారులు శాలువాతో సత్కరించి మొక్కను బహుకరించారు. గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పట్టి నేడు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాలు ఎంతో మంది సాధించారని అన్నారు. గతంలో ఎటువంటి సాధనలు లేని సమయంలో సమాచారం కావాలన్న, పుస్తకం కావాలన్న లైబ్రరీపైనే ఆధారపడాల్సి వచ్చేదన్నారు. పాఠకులు ఏ విషయాన్ని అడిగి ఇక్కడి సిబ్బంది ఓపికగా వింటూ సహకరిస్తున్నారన్నారు. నిధులు లేకున్న అరకోర నిధులతో వ్యవస్థను గొప్పగ నడిపిస్తున్న అధికారులకు అభినందలు తెలిపారు. పాత వ్యవస్థల కాకుండా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రంథాలయాలు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో కావాల్సిన వాటి గురించి ప్రణాళికలు చేయాలని, వాటిని పరిష్కారించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాస్, సిబ్బంది కిరణ్, వంశీ, సతీష్, బీజేపీ నాయకులు సుభాష్ ఉన్నారు.

నిర్మల్‌రూరల్ : నిర్మల్ జిల్లా కేంద్రం వార్డు నెం 33 భాగ్యనగర్ కాలనీలోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 20 తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, చైర్మెన్ గంగ్రత్ ఈశ్వర్, పట్టణాధ్యక్షులు నాందేడపు చిన్నూ, సారంగపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ అబ్దుల్ ఆది,పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 14 వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేసి, అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడారు. విజ్ఞానాన్ని పెంపొందించుకోడానికి, ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకోడానికి, ఉన్నత వ్యక్తిత్వాన్ని సంపాదించుకొనుటకు, మనిషికి ఎన్నో మార్గాలు ఉన్నాయని, వాటన్నిటిలోకెల్లా అత్యుత్తమమైనది పుస్తక పఠనమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, నాయకులు, పలువురు పాల్గొన్నారు.

విద్యావైద్యం ఉపాధి కల్పించాలి

నవతెలంగాణ-బోథ్



విద్యావైద్యం ఉపాధి కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ మల్లేష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్ మాట్లాడారు. పేద, మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలందరికీ కేజీ టూ పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యని అందించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించి, ప్రాణాలను కాపాడాలని, ప్రతీ గ్రామంలో ఆధునిక ఆస్పత్రులు నిర్మించాలన్నారు. అలాగే ప్రజలందరికీ వారి, వారి అర్హతలను బట్టి ఉపాధిని కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మండల ఉపాధ్యక్షులు కుందూరు సుధాకర్, పెందూర్ జల్దేవ్, కలిగేటీ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి బిక్క రమేష్, కార్యదర్శి రాథోడ్ నరేందర్, సభ్యులు కొత్తూరు రాజేశ్వర్, స్వామి, చౌహాన్ సాయి పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్సిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



ఆర్టీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో పార్సిల్స్ హోమ్ డెలివరీ సదుపాయాన్ని కల్పించినట్టు బుధవారం ఆర్టీసీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడారు. ప్రజలు హోమ్ డెలివరీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ జిఆర్ రెడ్డి, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కే.సాయన్న, నిజామాబాద్ ఎగ్జిక్యూటివ్ కాశీరాం, నిర్మల్ కార్గో సిబ్బంది పాల్గొన్నారు.

అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం వద్దు



నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామ శివారు ప్రాంతంలోని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టవద్దని కోరుతూ బుధవారం రైతులు గ్రామస్తులు నూతనంగా ఎన్నికైన రైల్వే బోర్డ్ మెంబర్ ఉష్కం రఘుపతిని కలిసి అండర్ బ్రిడ్జి నిర్మాణంతో రైతులకు కలిగే సమస్యలను వివరించారు. గ్రామస్తులు తమ సమస్యను వివరిస్తూ రైల్వే రహదారి అవతల దాదాపుగా వందమంది రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల రైల్వే రహదారికి అనుకోని ఉన్న వ్యవసాయదారులకు రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతుందని, ఇప్పుడు కూడా రైల్వే రహదారి పక్కన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో మా పంట పొలాలకు వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు వెంటనే అక్కడ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తొలగించి ఇప్పుడు ఉన్న విధంగానే గేటు ఉంచాలని నిర్మాణం చేపట్టవద్దని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన రైల్వే బోర్డు మెంబర్ స్థలానికి చేరుకొని రైతులు విన్నవించిన సమస్యను రైల్వే అధికారులకు తెలియజేస్తానని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యున్ని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రఘు, గ్రామస్తులు రమణ, చంద్రన్న, పండరి, వినాయక్‌రెడ్డి, రామ్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శిశువు మృతికి కారణమైన వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు నిర్మల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సారంగాపూర్ మండలం ఆలూరుకు చెందిన ఉల్లెంగ గంగామణి అనే గర్భిణి ప్రసవం కోసం సోమవారం ఆస్పత్రిలో చేరారు. వైద్యురాలు నార్మల్ డెలివరీ చేద్దామని సూచించారు. కానీ శిశువు పురిట్లోనే మరణించిందని బాధితులు వాపోయారు.

ఏఎంసీ చైర్మెన్‌గా ఆదివాసులకు రిజర్వేషన్ కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఎంసీ చైర్మెన్‌గా ఆదివాసులకు రిజర్వేషన్‌లను కొనసాగించాలని ఏబీఎం జిల్లా అధ్యక్షుడు కినక సురేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో గత కొంత కాలంగా జైనథ్ ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలను గత ప్రభుత్వం ఆదివాసుల కోసమని రిజర్వేషన్‌లను తీసుకొచ్చిందన్నారు. కానీ ఈ రిజర్వేషన్‌లను గతంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే వారి స్వార్థ రాజకీయాల కోసం రిజర్వేషన్‌లను ఆదివాసులకు ఇవ్వకుండా కాలయాపన చేశారన్నారు. ఆ రిజర్వేషన్‌లను ఆదివాసీ నాయకులు పోరటాలు చేసి సాధించుకున్నారన్నారు. కానీ నేడు ఆదివాసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా రిజర్వేషన్‌లను తొక్కుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆదివాసీ రిజర్వేషన్‌లను తుంగలో తొక్కి ఆదివాసీ హక్కులను దెబ్బతిశారన్నారు. ఒకవైపు ఆదివాసీ రిజర్వేషన్‌లను తుంగలో తొక్కి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి కూడా జైనథ్ మండలానికి చెందిన వ్యక్తికి అప్ప జెప్పడం ఎంతవరకు సమంజసమో దీనికి కంది శ్రీనివాస్‌రెడ్డి సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులకు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ ఏ ఒక్క నాయకునికి ఆదివాసీ గ్రామాల్లోకి రానివ్వకుండా అడ్డుపడతామని హెచ్చరించారు. సమావేశంలో కుంర జంగు పటేల్, కుంర గులాబ్, ఆర్కా శేషారావు, ముర్తుజాఖాన్ నాయకులు పాల్గొన్నారు.

పులిసంచారంపై అటవీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-నార్నూర్

ఉమ్మడి మండలంలోని ఏజెన్సీ మారుమూల ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్టు అటవీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని బుధవారం మండల తుడుందెబ్బ నాయకులు అడా శ్రీరామ్ అన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురై పంట పోలాల నుంచి ఇంటికి తిరిగి వస్తున్నారన్నారు. తమ చేతికి వచ్చిన పంటను రైతులు తీయడానికి వెళితే పులి భయంతో రైతులు వ్యవసాయ పొలానికి రావడానికి జంకుతున్నారన్నారు. వెంటనే జిల్లా డివిజన్ రేంజ్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అవార్డులు అందుకున్న ఆర్టీసీ డ్రైవర్లు



నవతెలంగాణ-ఉట్నూర్

ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్, మెకానిక్‌లకు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమాన్, డిపో మేనేజర్ కల్పన ప్రగతి చక్ర అవార్డులను అందజేశారు. బుధవారం మండలంలోని ఆర్టీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అవార్డులు అందుకున్న వారిలో కండక్టర్ తులసిరామ్, రాజమణి, మనోహర్, సంగీత, మెకానిక్ రమాకాంత్ ఉన్నారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-జైనథ్

గతంలో బాధితుడు పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి బుధవారం బాధితునికి తిరిగి అప్పగించామని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. అందులో భాగంగా ఎస్పీ గౌస్ ఆలం చేతులమీదుగా 15 మంది బాధితులకు పోగొట్టుకున్న ఫోన్లు ఇవ్వడం జరిగిందని అన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బూరుగుడ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆర్జేడీ ఏడీకి బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కోరారు. పాఠశాలలోనీ ప్రధానోపాధ్యాయుడు అవినీతికి పాల్పడుతున్నారని టీఎస్‌యూటీఎఫ్ చేసిన ఆరోపణ నేపథ్యంలో ఆర్జేడీ నుండి ప్రత్యేక అధికారి బుధవారం విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో నెలకొన్న సమస్యలపై బీసీ యువజన సంఘం అధికారి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ పని చేయకపోవడంతో బోర్ నీళ్లు తాగుతున్నారని, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని దీంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఐఎంఏ జాయింట్ సెక్రటరీకి సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఇండియన్ మెడికల్ అసోషియేషన్ (ఐఎంఏ) సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ సునీత రావూజీని బుధవారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సన్మానించారు. ఐఎంఏ తెలంగాణ చాప్టర్‌కు సునీత రావూజీ సంయుక్త కార్యదర్శిగా ఎన్నిక కాగా స్థానిక ఐఎంఏ హాలులో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సీతారాం, ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ ప్రవీణ్, ఐఎంఏ కాగజ్‌నగర్ అధ్యక్షుడు నాచగిరి, కార్యదర్శి సాయివివేక్, వైద్యులు నవ్యశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేలా బోధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య



నవతెలంగాణ-దహెగాం

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేలా బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఇట్యాల ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, గెర్రగుట్ట పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వివిధ సబ్జెక్టులలో నైపుణ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ పుస్తకాలు పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్షిప్‌లకు సంబంధించిన హాల్ టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలా బోధించాలని సూచించారు. వర్క్ బుక్కులను పాఠ్య పుస్తకాలతో అనుసంధానం చేసి భోదించాలన్నారు. ఇట్యాల ఉన్నత పాఠశాలలో నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్షిప్‌కు ప్రత్యక్ష శిక్షణ ఇవ్వడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ పాటించడంతో పాటు శుభ్రంగా పండాలని సూచించారు.

మైనింగ్ టెక్నికల్ స్టాప్ అలవెన్సులు సవరించాలి

- టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మాల్రాజ్ శ్రీనివాసరావు



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో టెక్నికల్ ఏ గ్రేడ్ మైనింగ్ టెక్నికల్, ఇతర డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లకు చెల్లించే భృతికి అలవెన్స్‌లను సవరించి డబ్బులు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) ఉపాధ్యక్షుడు మాల్రాజ్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సంఘ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి పనిచేస్తున్న సూపర్‌వైజర్లకు టెక్నికల్ ఇతర డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లకు అలవెన్సులు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొగ్గు గని కార్మికులకు వేతన ఒప్పందంతో కార్మికులకు 1-7-2022 నుండి అమలు కావాల్సి ఉండగా మార్చి 2022లో ఒప్పందం జరిగిన రోజు నుండి పెరిగిన అన్ని అలవెన్స్ చెల్లింపులు జరుగుతున్నాయని కానీ సూపర్‌వైజర్లకు ప్రత్యేకంగా మూడు సంవత్సరాలు గడిచిన పెంచి ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కూడా చొరువ తీసుకుని అలవెన్సులను పెంచి చెల్లించే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, సెంట్రల్ కమిటీ నాయకులు మాంత్ సమ్మయ్య పాల్గొన్నారు.

బదిలీ ఎస్ఐకి సన్మానం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం పోలీసు స్టేషన్ నుండి బదిలీపై వెళతున్న ఎస్ఐ రామన్ కుమార్‌ను బుధవారం స్టేషన్ ఆవరణలో సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈజ్‌గాంలో సక్రమంగా విధులు నిర్వర్తించి స్థానికుల మన్ననలు పొందారని కొనియాడారు. భవిష్యత్తులో ఎస్ఐ రామన్‌కుమార్ ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈజ్‌గాం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి అన్నారు. మాజీ ఎంపీపీ మల్లికార్జున్ నివాసంలో నిర్వహించిన మండల ఎన్నికల వర్క్ షాప్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. సంస్థాగత నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేస్తూ బూత్ అధ్యక్షుల నుండి శక్తి కేంద్ర ఇన్‌చార్జిల వరకు నియమించారు. రాబోయే కాలంలో స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీని గెలిపించే దిశగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వారితో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో చలి పంజా

- రాష్ట్రంలోనే సిర్పూర్(యు) రెండవ స్థానం
- ఉదయం, సాయంత్రం మంచు దుప్పటి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతుంది. ఎక్కువ అటవీ ప్రాంతం కొండలు గుట్టలతో కూడుకొని ఉండడంతో రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే చలి ఎక్కువగా ఉంటుంది. రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తుండగా బుధవారం ఉదయం రాష్ట్రంలోనే అత్యల్పంగా ఉన్న ప్రాంతాల్లో సిర్పూర్(యు) రెండవ స్థానంలో నిలిచింది.

రాష్ట్రంలోనే సిర్పూర్(యు) రెండవ స్థానం

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతల్లో అత్యల్పంగా నమోదైన ప్రాంతాల్లో వికారాబాద్ జిల్లా కోహీర్(9.5) ఉష్ణోగ్రతలు నమోదు కాగా, జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో 9.7 ఉష్ణోగ్రత నమోదు రాష్ట్రంలోనే రికార్డుగా నిలిచింది. మిగతా ప్రాంతాలను చూస్తే కెరమెరి 12.3, గిన్నెదరి 12.6, ఆసిఫాబాద్ 12.7, చింతలమానేపెల్లి 13.4, తిర్యాణి 11.1, వాంకిడి 12.4, దహెగాం 13.7లలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జిల్లాపై మంచు దుప్పటి

ఓవైపు అత్యధికంగా చలి నమోదు అవుతున్న వేళ ఉదయం సాయంత్రం మంచుతో రహదారులు కూడా కనిపించని పరిస్థితి తలెత్తుతోంది. జిల్లాలో రహదారులపై మంచు ఎక్కువగా ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

చలి తీవ్రత మరింత పెరగనున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అవసరమైతేనే రాత్రిపూట బయట తిరగాలని సూచిస్తున్నారు. ఆస్తమా ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. చలిలో తేమ కారణంగా శ్వాసకోశ సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కృషి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మత్స్యకారులు చేప పిల్లల పెంపకం ద్వారా ఆర్థిక అభివద్ధి, ఉపాధి పొందాలని పొందవచ్చునిసిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లూరు గ్రామ శివారులో గల బొక్కివాగు ప్రాజెక్టులో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను చెరువులో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు చెరువుల, ప్రాజెక్టుల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్నామన్నారు. చేపలు పట్టి జీవిస్తున్న వారిని పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి మనీషా, మాజీ ఎంపీటీసీ దూకుంట రాజన్న, రెవెన్యూ ఇన్స్ పెక్టర్ సురేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చపిడే సత్యనారాయణ, బీజేపీ మండలాధ్యక్షుడు మధూకర్, నాయకులు ప్రభాకర్ గౌడ్, నాగేష్, హరీష్, శ్రీకాంత్, శోభన్, నాన్నయ్య, సంతోష్, పురుషోత్తం, వెంకటేష్, మహేష్, రవి పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్ : ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే



దహెగాం : కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ..

మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి దరఖాస్తులను ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు త్వరగా అందేలా చూడాలన్నారు. పేదింటి ఆడ పిల్లకు ఈ పథకం వరమని అన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దహెగాం : మండలంలోని రైతు వేదికలో బుధవారం 76 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు పంపిణీ చేశారు. ఆడ పిల్లల పెళ్లిళ్లకు ప్రభుత్వం తరపున అందిస్తున్న పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేందర్, సింగిల్ విండో చైర్మన్ కోండ్ర తిరుపతి గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, ఆర్ఐ శృతి, ఎంసీ రాథోడ్ ధన్‌రాజ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ఆసిఫాబాద్ : మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అనంతమైన విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. మన ప్రాచీన చరిత్ర, దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయులు, దేశాభివృద్ధికి అలుపెరగని కృషి చేసిన మహానుభావుల చరిత్రకు సంబంధించిన పుస్తకాలు, ప్రపంచాన్ని నడిపిస్తున్న సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చని, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ గ్రంథాలయంలో పాఠకులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, పత్రికలు, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకొని ఇటీవల జరిగిన డీఎస్సీ, గ్రూప్-4, పోలీస్ ఉద్యోగాలలో దాదాపు 20 మంది వరకు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తుకు అవసరమైన సలహాలు, సూచనలకు వారంలో ఒక గంట కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్, పుస్తకాల ప్రదర్శన, వ్యాసరచన, కవి సమ్మేళనం, పాటల పోటీలు, రంగోలి పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి సరిత, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, జిల్లా పరీక్షల అధికారి ఉదయ్ బాబు, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, గ్రంథాలయ అధికారులు సదానందం, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : పుస్తక పఠనం ద్వారానే విద్యార్థులలో విజ్ఞానం పెంపొందుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ ముగింపు ఉత్సవాలను బుధవారం డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు సాధించి భవిష్యత్తులో స్థిరపడవచ్చన్నారు. పుస్తక పఠనం మంచి సంస్కృతిని కూడా అలవర్చుతుందని అన్నారు. వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి దత్తాత్రేయ, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహం, అధ్యాపకులు జనార్దన్, శారద, వెంకటేశ్వర్లు, రోస్‌మేరీ, కృష్ణవేణి, దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.





కాగజ్‌నగర్ : ముగింపు ఉత్సవాలకు హాజరైన విద్యార్థులు

టీపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కెరమెరి

తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆత్రం భుజంగ్ రావ్ తెలిపారు. బుధవారం మండలంలోని మోడీ ఆశ్రమ పాఠశాలలో జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా సీహెచ్ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కనక వెంకటేశ్వర్ రావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సుందర్, కమల, సంతోష్, కర్ణు, ధర్మరావ్, కార్యదర్శులుగా గంగసాగర్, భగవంత్‌రావ్, మన్మద్ రావు, గణేష్, లక్ష్మణ్ రావ్, రాష్ట్ర కౌన్సిలర్లుగా శ్యామ్‌రావ్, అర్జున్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా నైతం నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్ రావ్ మాట్లాడుతూ విద్యా రంగం, ఉపాధ్యాయ సమస్యలపై తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రాతినిధ్యం వహిస్తూ ఉద్యమ కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఆర్టీల సమస్యలు పరిష్కరించి, పనికి తగిన గౌరవ వేతనం ప్రతి నెల ఇచ్చే విధంగా చర్య తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉపాధ్యాయ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చినా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సీనియర్ కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు. 7





మెనూ అమలు చేయాలి : జడ్పీ సీఈఓ



నవతెలంగాణ-కెరమెరి

ఆశ్రమ వసతి గృహాల్లో మెనూ పాటించాలని జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మోడి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు శాతాన్ని, స్టాక్ రూంలోని సరుకులను పరిశీలించారు. అనంతరం కుల గణన సమగ్ర సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజత్ పాషా పాల్గొన్నారు.

కొత్త పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో మండల అభివృద్ధి అధికారి వి. ప్రవీణ్ కుమార్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఐదు నెలలలో చేయాల్సిన పనులకు ఉపాధి హామీ సిబ్బంది పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయ్యాలని, రైతుల నుంచి పశువుల కొట్టం, నీటి ఊట కుంటలు, కొత్త బావుల మంజురుకు దరఖాస్తులు తీసుకొని మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని, నర్సరీలలో ఎర్ర మట్టి తెప్పించి బ్యాగ్ ఫిల్లింగ్ త్వరగా పూర్తి చేసి గ్రామ పంచాయతీ అవసరాలకు అనుగుణంగా విత్తనాలు నాటాలని ఆదేశించారు. జాబ్ కార్డు ఉన్న అందరూ కూలీల ఆధార్ కార్డులు జాబ్ కార్డుకు అనుసంధానం చేయ్యాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ శ్రావణ్ కుమార్, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మోడల్ లైబ్రరీ ఏర్పాటు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం చింతగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మోడల్ లైబ్రరీని బుధవారం మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సామర్థ్యం, పఠనాసక్తి పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రతి రోజు పాఠశాలలో తప్పనిసరిగా లైబ్రరీ పీరియడ్‌ను నిర్వహించాలని సూచించారు. మండల నోడల్ అధికారి దేవాజీ మాట్లాడుతూ రూమ్ టు రీడ్ లైబ్రరీ పుస్తకాలు విద్యార్థులకు సులభరీతిలో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగేందర్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి హరీష్, కారోబార్ మహేష్, హెచ్ఎం ఎం.స్వప్న, ఉపాధ్యాయులు వనజ, శిరీష, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ మధూకర్, ఏపీసీ చైర్మన్ గీత, రూం టు రీడ్ కో ఆర్డినేటర్ పద్మశ్రీ పాల్గొన్నారు.

వికలాంగుల సాధికారత అవార్డుకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన దివ్యాంగులు, దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేసిన వ్యక్తులు, దివ్యాంగుల కోసం పని చేస్తున్న వివిధ సంస్థల నుండి రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డు-2024కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఎంపిక అయిన వారికి రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డును అందించడం జరుగుతుందని, ఇందుకుగాను వివిధ క్యాటగిరీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల దివ్యాంగులు, దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలు ఈ నెల 29లోగా తమ దరఖాస్తును హైదరాబాద్‌లోని మలక్‌పేటలో గల దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సంచాలకులు కార్యాలయంలో సమర్పించాలని, దరఖాస్తును ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డబ్ల్యూడీఎస్సీ.తెలంగాణ.జీఓవీ.ఇన్ పొందవచ్చని, వివరాలకు దివ్యాంగుల టోల్ ఫ్రీ నెంబర్ 155326లో సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు అండర్17 నెట్ బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నేడు జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో అండర్ 17 బాలబాలికలకు నెట్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం, ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు అర్హులేనని, ఈ పోటీలలో పాల్గొనేవారు తమ ప్రధానోపాధ్యాయుల చేత ఎంట్రీ ఫామ్, బోనాఫైడ్ పైన సంతకం చేయించి వాటికి ఆధార్ జిరాక్స్ జతపరచి తీసుకొని రావాలని, ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



71వ అఖిల భారత సహకార వారోత్సవాలలో బాగంగా లక్షెట్టిపేట మండలంలోని చందారం గ్రామ రైతు పొదుపు పరపతి మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ సీడ్ ప్లాంట్ ఆవరణలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, మెరుగైన ప్రపంచ సాధనలో సహకార సంఘాల పాత్ర గురించి సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ముస్కు రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు సత్యనారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, చంద్రయ్య, రామయ్య, సభ్యులు శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

కుంరం సూరు వర్ధంతి

నవతెలంగాణ-కాసిపేట



కొలాం సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రొట్టెపల్లి పంచాయతీలోని కొత్త తిరుమలాపూర్ గ్రామంలో కుంరం సూరు 27వ వర్ధంతిని నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సాంప్రదాయం ప్రకారం డోలు వాయిద్యాలతో జెండా ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయక్పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, ఆదివాసీ సేన అధ్యక్షుడు మడావి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, ముత్యాల రాజమౌళి, మేరుగు శ్రీనివాస్, ఆత్రం మహేశ్, గ్రామ పటేల్ టేకం శ్రీను, సిడం గణపతి, పెంద్రం శంకర్, సిడం అంబారావు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై భీమారం గ్రామ శివారులో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జైపూర్ మండలం రసూల్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుదారి మల్లేష్(28) మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పోలంపల్లి సమీపంలో గల పేరలఫ్ ఇండియా స్కూల్ బస్ డ్రైవర్‌గా పని చేస్తున్న మల్లేష్ ఉదయం 6.30 గంటలకు ఫ్యాషన్ ప్రో మోటార్ సైకిల్‌పై ప్రయానిస్తుండగా ఏపీ28 ఈబీ 8595 నెబర్ కారు ఢీకొట్టిన ఘటనలో ఆకుదారి మల్లేష్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి ఆకుదారి రాజు పిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న మల్లేష్‌ను కావాలని కారుతో ఢీకొట్టి హతమార్చినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. మృతుని కుటుంబానికి విరోదులైన వారు రోడ్డు మీదుగా ప్రయాణిస్తుండగా కాపు కాసి కారుతో ఢీకొట్టారన్న ఆరోపనలు విన్పిస్తున్నాయి.

పంట వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలి



నవతెలంగాణ-మందమర్రి

వరి కొయ్యకాళ్లు కాల్చకుండా పొలంలోనే కలియ దున్నాలని పంట వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి రైతులకు సూచించారు. బుధవారం నార్లాపూర్ గ్రామ రైతులకు వరి కొయ్యలు కాల్చడం ద్వారా కలుగు దుష్ప్రభావాలపై వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కొయ్యకాళ్లు కాల్చుట ద్వారా భూ కాలుష్యంతో పాటు భూతాపం పెరుగుతుందన్నారు. వరి కొయ్యలు కాల్చుట ద్వారా ఏర్పడు పొగ చలి కాలంలో కురిసే మంచుతో కలిసి పొగమంచుగా ఏర్పడి వాతావరణాన్ని కలుషితం చేస్తుందని తద్వారా వెలువడే కార్బన్ ఉద్గారాలతో ఓజోన్ పొరకు నష్టం వాటిల్లి అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరుట ద్వారా మనుషులకు, సకల జీవ జాతికి శ్వాశ కోశ వ్యాధులతో పాటు అనేక రకాల క్యాన్సర్లకు మూల కారణం అవుతుందన్నారు.

విజేతలైన ఉద్యోగులకు బహుమతులు

నవతెలంగాణ-నస్పూర్

బొగ్గు నాణ్యత వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, స్లొగన్స్ పోటీలలో గెలుపొందిన బుధవారం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గని ఇన్‌చార్జి మేనేజర్ ఐ శ్రీనివాస్, క్వాలిటీ ఇన్‌చార్జి ఎస్ కే కమురుద్దీన్, గుర్తింపు సంఘం జాయింట్ సెక్రటరీ రాచర్ల చంద్రమోహన్, ఫిట్ సెక్రటరీ మోతే లచ్చన్న, సంక్షేమ అధికారి బి.శంకర్, జలాలుద్దీన్, కెమిస్ట్ సమ్మయ్య పాల్గొన్నారు.

సైకాలజిస్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి నారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నూతనంగా జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు. మంచిర్యాల జిల్లా సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అడ్వొకెట్ రంగు వేణు కుమార్‌ను నియమించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సమాజంలో గొప్ప మానసిక పరివర్తన తీసుకొని రావడం కోసం కృషి చేస్తానని, జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం, వివిధ మానసిక వికాసంపై అవగాహన కార్యక్రమాలను చేపడుతూ తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్‌ను బలపరిచేందుకు అనుక్షణం పాటుపడతానని ఎన్నికైన సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, చెరకు శశి, మొగిలి, రజిత, కవిత, సుమన చైతన్య, చంద్ర మోహన్‌గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొత్త తిరుమలాపూర్, పాత తిరుమలాపూర్ గ్రామంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆదివాసీ నాయకోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు తన జన్మదినం సంధర్భంగా ఆదివాసీ సంఘాల ఆధ్వరంలో నోట్ బుక్స్, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన అధ్యక్షుడు మడావి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, ఉపాధ్యాక్షుడు ఆత్రం మహేష్, మడావి పర్వత్రావ్, అంబరావ్ పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు అవకాశం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేసుకునే రైతులకు మంచి అవకాశం వచ్చిందని, కావలసిన రైతులు తమను సంప్రదించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత ప్రకటనలో పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు ఆయిల్ ఫామ్ సాగు ఉపయోగపడుతుందన్నారు. ఆయిల్ ఫామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి, ఉద్యానవన శాఖ అధికారిని సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాసిపేట



కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రి ఏరియా కాసిపేట వన్ ఇంక్లైన్ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ముందుగా నిరసన తెలిపి పలు సమస్యలపై గని మేనేజర్ భూ శంకరయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ గనిలో నాణ్యమైన పని ముట్లు ఇవ్వాలని, తీవ్రమైన చలికి వణుకుతున్న ట్రామర్ ఉద్యోగులకు, మెన్ ఇంక్లైన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు వెంటనే చలి కోట్స్ ఇవ్వాలని, సర్ఫేస్ బంకర్‌ను వెంటనే రిపేర్ చేయాలన్నారు. నాణ్యమైన గ్లౌజులు, షఉస్, టెక్నీషియన్స్‌కి పని ముట్లు ఇవ్వాలన్నారు. లాకర్ సదుపాయం కల్పించాలని, స్టవ్వింగ్ తడకలు, ఇసుక, లైన్మెన్ కీలలు, సుత్తులు, గిర్మిట్లు, కార్మికులకు రెస్ట్ హాల్ షెడ్, సోమాగూడెం నుండి వచ్చే రోడ్డు నిర్మించాలన్నారు. ఏఐటీయూసీ కార్మిక సమస్యలపై కొన్ని సంధర్భాలలో ఆందోళనలు తప్పవన్నారు. అదే విధంగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, యాజమాన్యంతో ఈ నెల 28 జరిగే కార్పొరేట్ స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి వడ్డమల్ల రాజేందర్, పార్వతీ సురేష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ జి రంజిత్ కుమార్, అశోక్, లింగయ్య, దాసరి అనీల్, బల్లెం శ్రీనివాస్, ఆడ రవీందర్, శంకర్, తిరుపతి, ఏలూరు శ్రీనివాస్, పోలకాని శ్రీనివాస్, సతీష్, అంజనేయులు, కే మహేష్, స్వామి, జాడి తిరుపతి, పాషా పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించిన కలెక్టర్



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గంలోని రేపల్లె మహేశ్వరీ శ్రీరామ జిన్నింగ్ మిల్లులలను బుధవారం కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించి పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. పత్తి రైతులతో మాట్లాడారు. పత్తి పంట అమ్మకాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అధికారులు తెలియజేయాలన్నారు. 8 శాతం తేమగల పత్తికి సీసీఐ మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోరాదని తెలిపారు. నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తరలించి, సీసీఐ ద్వారా మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రస్తుతం ఒకే డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉండడం వల్ల పత్తి బండ్ల అన్లోడింగ్ ఆలస్యం అవుతుందని అదనంగా మరొక డాటా ఏంట్రి ఆపరేటర్లను నియమించాలని రైతులు, మిల్లు యాజమాని కలెక్టర్‌ను కోరారు. వెంటనే ఇద్దరు డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియమించాలని కలెక్టర్ సీసీఐ ఉన్నతాధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ తూనికలు కొలమానాల శాఖ వ్యవసాయ అధికారులు ప్రతినిత్యం మిల్లులను సందర్శించి పత్తి తూకాలను వే బ్రిడ్జిలను పర్యవేక్షించాలని ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సీసీఐ అధికారులు టోకెన్ల పంపిణీ పత్తి కొనుగోలు తేమశాతం నిర్ధారణలో పారదర్శకత పాటించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ల్యాండ్ ఆర్డర్ సమస్యలను కాపాడుతూ వడ్ల కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ కార్యనిర్వాహక పనులను సమర్థవంతంగా నిర్వర్తించాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ జిన్నింగ్ మిల్ యజమానులు ప్రవీణ్, శ్రీనివాస్ రైతులు ఉన్నారు.

సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-మందమర్రి



ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల టెండర్ పిలిచి, గార్డ్‌లని విధుల్లోకి తీసుకోవాలని దూలం శ్రీనివాస్ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్ చేసారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల టెండర్ ముగిసి నెల అయినా కొత్త టెండర్ పిలవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల డ్యూటీలు లేక కార్మికులు ఆర్థికంగా, మానసికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ పేర్కొన్నారు. సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు సింగరేణి ఆస్తులను కాపాడటంలో కీలకమైన పాత్ర పోషిస్తున్న, వారి టెండర్లను పిలవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. దీనినే నమ్ముకొని డివిజన్ పరిధిలో 48 మంది కార్మిక కుటుంబాలు ఉన్నాయన్నారు. గతనెల 27న టెండర్ గడువు ముగిసినా ఇప్పటి వరకు కొత్త టెండర్ పై ఎలాంటి క్లారిటి లేకపోవడంతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి టెండర్ పిలిచి, కార్మికులందరిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేసారు. లేకుంటే పోరాటాలకు సైతం సిద్ధమతవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు సెక్యూరిటీ గార్డులు వికాస్, సంపత్, శ్రీధర్, మల్లేష్, రమేష్, గోపాల్, దినేష్, శ్రీనివాస్, మహేష్, బిక్షపతి, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్క్ షాప్, సీహెచ్‌పీలలో నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్క్ షాప్, సీహెచ్‌పీలలో నూతన కన్వీనర్, కో-కన్వీనర్‌లను బుధవారం బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎన్నుకున్నారు. ఏరియా వర్క్‌షాప్ కన్వీనర్ పాడిశెట్టి వినోద్, కో-కన్వీనర్ తన్నీరు శ్రీకాంత్, సీహెచ్‌పీ కన్వీనర్ అందే రాజ్ కుమార్, కో-కన్వీనర్ కాసర్ల లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు ముస్కె సమ్మయ్య, మారుతి, బద్రి బుచ్చయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండి, తమ హక్కుల సాధన కోసం చైతన్య వంతులుగా పనిచేయాలని, కమ్యూనిటీ శ్రేయస్సు కోసం కట్టుబడి ఉండాలని, అన్ని వర్గాల బీసీ ఉద్యోగుల భాగస్వామ్యంతో ఏకతా బలపరచాలని పేర్కొన్నారు. అయితే, బీసీ ఉద్యోగుల సమస్యలు, నష్టపోయే అవకాశాలను నివారించడం, సమానత్వం కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల బలపరచడంలో మహాసభ కీలకమని, అందులో నాయకత్వం వారి పాత్ర ఎంతో కీలకమని స్పష్టం చేశారు. ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన ఈ సమావేశంలో సదానందం, చారి, రాజశేఖర్, తదితర బీసీ సోదరులు పాల్గొని సంఘం పటిష్ఠతపై తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కొత్త నాయకత్వం బీసీ సంఘాన్ని మరింత బలపరుస్తూ, ఉద్యోగుల హక్కుల కోసం ప్రతిష్ఠాత్మకంగా పనిచేస్తుందని, కొత్త ప్రణాళికలతో సంఘ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-తాండూర్



పంచాయరుతీలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తాండూర్ ఎంపీఓ అనిల్ సూచించారు. బుధవారం తాండూర్ మండలంలోని నీలాయిపల్లి, మాదారం, మాదారం-3 ఇంక్లైన్, గ్రామ పంచాయితిలను సందర్శించారు. సర్వే పనులు పూర్తి చేసిన పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్ లను సందర్శించి కంపోస్ట్ పిట్ లో కంపోస్ట్ ఎరువును తయారి విదానమును పరిశీలించారు. ఉత్పత్తి అయిన కంపోస్ట్ ఎరువును నర్సరీ , పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు వినియోగించాలన్నారు. గ్రామపంచాయతీ పరిసరాలలో లభ్యమయ్యే పకృతి వ్యర్థాలను, సహజ వనరులను ఉపయోగించుకొని గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా ప్రణాళికలు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రంజిత్ కుమార్, సౌందర్య తౌఫిక్ ఉన్నారు.

పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పత్తి పంటను అమ్ముకోవాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం చెన్నూర్ పట్టణంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎకరా ఒకంటికి 12 క్వింటాళ్లకు మించిన పత్తిని తీసుకోవడం లేదని ఎకరా ఒకంటికి 16 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసే విధంగా చూడాలన్న రైతుల డిమాండ్ మేరకు స్పందించారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి పత్తి రైతుల సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో క్వింటాకురూ. 7,400 చొప్పున మద్దతు ధర ప్రకటించడం జరిగిందని అన్నారు.

కుందారంలో రైస్‌మిల్ ప్రారంభం

మండలం కుందారం గ్రామంలో నూతనంగా నిర్మించిన సత్యనాయణస్వామి ఆగ్రోస్ రైస్‌మిల్‌ను ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. కుందారం మాజీ ఎంపీటీసీ రాచర్ల సతీష్, రాచర్ల శ్రీనివాస్‌లతో నిర్మించిన రైస్‌మిల్‌ను బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు.

నవజాత శిశువుకు అరుదైన చికిత్స



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని మల్లికార్జున పిల్లల ఆస్పత్రిలో నవజాత శిశువుకు అరుదైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. పిడియాట్రిషన్ డా గోపతి శ్రీనివాస్ బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాపల్లికి చెందిన ఆకాంక్ష జిల్లా కేంద్రంనికి చెందిన ఓ ఆస్పత్రిలో వారం రోజుల క్రితం మగ శిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన ఏడు రోజులలోనే శిశువు తీవ్ర అనారోగ్యనికి గురి అవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. మల్లికార్జున పిల్లల ఆస్పత్రికి వచ్చి పిల్లల వైద్య నిపుణుడు గోపతి శ్రీనివాస్‌ని సంప్రదించగా శిశువు పరిస్థితి విషమంగా ఉందని గమనించిన వైద్యుడు శ్రీనివాస్ స్పందించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం శిశువును ఎస్ఐసియూలో అడ్మిట్ చేసి ఆరు రోజులపాటు ప్రత్యేక శ్రద్ధతో శిశువుకు అవసరమైనటువంటి చికిత్స అందించి శిశువు కోలుకున్నాక తల్లి తండ్రులకు అందించినట్లు తెలిపారు. బాబు ప్రాణాలు కాపాడిన డాక్టర్‌కు శిశువు కుటుంబికులు కృతజ్ఞతలు తెలిపారు.

డిసెంబర్ 9న జేబీసీసీఐ సమావేశం

నవతెలంగాణ-జైపూర్

కోలిండియా స్టాండర్డైజేషన్ కమిటి డిసెంబర్ 9న సమావేశం కానున్నట్లు కోలిండియా జనరల్ మేనేజర్ (లేబర్ ఫోర్స్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్) జారీ చేసిన లేఖలో పేర్కొంది. కోలిండియా స్టాండర్డైజేషన్ కమిటి 11వ సమావేశం ఈ సారి ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తుండగా సభా వేధిక ప్రకటించాల్సివుంది. అంతకు ముందు బోనస్ నిర్ణయించడానికి కోలిండియా స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం న్యూఢిల్లీలో సెప్టెంబర్ 29న నిర్వహించగా ఈ సారి చత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్ సమావేశానికి వేధిక కాబోతుంది. సమావేశం ఏజెండా ప్రకటించకపోయినప్పటికీ పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చ కొనసాగనున్నట్లు తెలుస్తోంది.

కేకే ఓసీపీలో పర్యటించిన డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్

నవతెలంగాణ-మందమర్రి

డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం జీఎం దేవేందర్‌తో కలిసి కేకే ఓసీపీలో పర్యటించి పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్షించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేసినప్పుడే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సులువవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, కేకే ఓసీ గని మేనేజర్ రామరాజు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని వెంటనే మార్చాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బాదంపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని మార్చాలని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్థులు కోరారు. ఆ పాఠశాల ఎదురుగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్తంభం స్థానంలో కొత్త స్తంభం తీసుకువచ్చిన దాన్ని మార్చలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త స్తంభాన్ని బిగించి ప్రమాదాలు నివారించాలన్నారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్ఐ

నవతెలంగాణ-తాండూర్



తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్యాంకు కార్యాలయాలను బుధవారం ఎస్ఐ కిరణ్ కుమార్ సందర్శించి సీసీ కెమెరాలు పని తీరును బ్యాంకు లాకర్లను పరిశీలించారు. బ్యాంకు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలతో పాటు అలారం పనిచేయడం ఏటీఎం మెషిన్ల వద్ద భద్రత పనితీరును పరిశీలించి బ్యాంకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.